జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శనివారం 14 నవంబర్ 2026 పేజీలు:09



సర్పంచ్ కె బాలరాజ్ ఆధ్వర్యంలో విఓ భవన నిర్మాణం భూమి పూజ

కృష్ణా నవంబర్ 13 (ప్రజాజ్యోతి)

కృష్ణా మండల పరిధిలోని ముడుమాల్ గ్రామంలో శుక్రవారం గ్రామ మహిళా సమైక్య భవనం నిర్మాణానికి గ్రామ సర్పంచ్ తో పాటు నాయకులు భూమి పూజ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విభిజీ రామ్ జీ పథకం కింద రూ.10 లక్షల వ్యయంతో గ్రామంలో వివో భవనాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని మహిళ సంఘాల సమావేశాలు, ఆర్థిక లావాదేవీలు, - మిగతా 2 లో



ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి
- యంగ్ ఇండియా,తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను గడువులోగా పూర్తి చేయాలి

గద్వాల నవంబర్ 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):

రాబోయే రబీ 2026-27 సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులకు సూచించారు. - మిగతా 2 లో



పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- డయల్ 100 కాల్స్ పట్ల నిర్లక్ష్యానికి తావులేదు - సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి- మిస్సింగ్ కేసులకు ప్రధాన్యత ఇవ్వాలి
- ఎస్సి-ఎస్టీ కేసులను గడువులోగా పూర్తిచేయాలి - జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్

నవంబర్ 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):

నాగర్ కర్నూల్ జిల్లాలో నమోదవుతున్న వివిధ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డా:సంగ్రామ్ సింగ్ జి పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన - మిగతా 2 లో

హలో రైతన్న.. చలో నల్లగొండ!



- 36వ ఆల్ ఇండియా కిసాన్ మహాసభలను జయప్రదం చేయండి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్. దేశ్యనాయక్


నాగర్ కర్నూల్ నవంబర్ 13 (ప్రజాజ్యోతి బ్యూరో)

నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న 36వ ఆల్ ఇండియా కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జీపు జాతను రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్. దేశ్యనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ్యనాయక్ మాట్లాడుతూ.. నాలుగు రోజులపాటు జరిగే ఈ మహాసభలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రైతు సంఘం ప్రతినిధులు, జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు. - మిగతా 2 లో

ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలి

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ,భూసేకరణ,వీధి కుక్కల నియంత్రణ,వీబీ జీరాంజీ పనుల పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ,రైతులను ఉద్యాన పంటలు,ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లించాలని,సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు.పంటల వైవిధ్యీకరణ,రైతు ఐడీ నమోదు,కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని,ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు,ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు,ఇతర పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.ప్రైవేటు మార్కెట్‌లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.విద్యాశాఖపై సమీక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు,ఉపాధ్యాయులు,ఇతర సిబ్బంది హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరును పర్యవేక్షిస్తూ విద్యార్థుల హాజరు కనీసం 90 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.పాఠశాలల వారీగా విద్యార్థులు,ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని క్రమం తప్పకుండా సమీక్షించాలని తెలిపారు.ఉపాధ్యాయుల హాజరు మెరుగుపడితే విద్యార్థుల హాజరు కూడా పెరుగుతుందని,క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యే



విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు,విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఫిజిక్స్ వాలా,ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.సమగ్ర శిక్ష అభియాన్,పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల వ్యయంతో 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ.625 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షిస్తూ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.అదేవిధంగా రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ అభివృద్ధి పనులు,ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సీఎస్ ఆదేశించారు.భూసేకరణ కోసం అవసరమైన నిధులను కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.నిర్దిష్ట గడువులోగా భూసేకరణ పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని,



అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని పేర్కొన్నారు. గ్రామాలు,పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని సూచించారు. బస్టాండ్లు,రైల్వే స్టేషన్లు,ఇతర జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి,నిబంధనల ప్రకారం వాటిని పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వీబీ జీరాంజీ పథకం కింద చేపట్టే పనులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని,గ్రామాల్లో నీటి సంరక్షణ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ సూచించారు.నీటి నిల్వ,భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులను విస్తృతంగా చేపట్టాలని,సాగునీటి కాలువలను శుభ్రం చేసి అవసరమైన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు చేశారు.ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని,శాఖలవారీగా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్,నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావు,భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మొదటిపేజీ తరువాయి

మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో ఎస్పీ జిల్లా వ్యాప్తంగా నమోదైన నేరాలు,వాటి దర్యాప్తు పురోగతి,మిస్సింగ్ కేసులు,ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు,గ్రేవ్,నాన్-గ్రేవ్,సైబర్ నేరాలు,ట్రాఫిక్ అమలు చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మిస్సింగ్ కేసుల దర్యాప్తును అత్యంత ప్రాధాన్యంతో చేపట్టి,అదృశ్యమైన వారి ఆచూకీ త్వరితగతిన గుర్తించేలా చర్యలు తీసుకోవాలని,ఎస్సీ ఎస్టీ కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యానికి తావులేకుండా చట్టపరమైన గడువుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని,గ్రేవ్,నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించాలని,క్రైమ్ అండ్ క్రిమి నల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ డేటాను తప్పనిసరిగా నవీకరించాలని,మాన్యువల్ రికార్డులు మరియు సీసీటీఎన్ఎస్ నమోదుల మధ్య ఉన్న వ్యత్యాసాలను వెంటనే సరిచేయాలని,ప్రతి కేసుకు సంబంధించిన వివరాలు సకాలంలో నమోదు చేయాలని,సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని,మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా ఎన్.సీ.ఆర్.పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని,డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు,ఫేక్ నెంబర్ ప్లేట్ల పట్ల ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని,డయల్ 100కు వచ్చే ఫిర్యాదులపై పోలీసులు వెంటనే స్పందించాలని,అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సకాలంలో సహాయం అందేలా ప్రతి కాల్‌ను అత్యంత ప్రాధాన్యంతో పరిగణించాలని సూచించారు.సమావేశంలో డీఎస్పీలు సాయి వెంకట్ రెడ్డి,శ్రీనివాస్,బుర్రి శ్రీనివాస్,సీఐలు అశోక్ రెడ్డి,శంకర్,నాగరాజు,భీమ్ కుమార్,మహేష్,రఘువీరారెడ్డి,చంద్రయ్య,వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ కె బాలరాజ్ ఆధ్వర్యంలో విజీ భవన నిర్మాణం భూమి పూజ

మొదటిపేజీ తరువాయి

మరియు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించటకు సొంత భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ భవనన్ని నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రాజు, ఎఈఈ మధు, ఉపసర్పంచ్ తనయుడు జి వెంకటేష్, ఎపిఎం వనిత కుమారి, వార్డు సభ్యులు చెన్నయ్య గౌడ్, మరియు కాడ్రు తమ్మప్ప, వాకిటి భీం శంకర్, టి నరసింహా, జీ బస్వరాజ్, యం గోపాల్, రంగప్ప, కె లింగప్ప, చాకలి మరెప్ప,చాకలి గోపాల్ మరియు గ్రామ మహిళ సంఘం లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

హలో రైతన్న.. చలో నల్లగొండ!

మొదటిపేజీ తరువాయి



తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కష్టజీవులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ రంగం సంక్షోభం, రైతులకు గిట్టుబాటు ధరలు, పంటల నష్టాలు, రైతుల హక్కులు తదితర అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించి, భవిష్యత్తు రైతాంగ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.నవంబర్ 15న రైతులంతా నల్లగొండకు తరలివచ్చి 36వ ఆల్ ఇండియా కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పర్వతాలు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వర్ధం సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మల్లేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ నాయక్, ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, ఆర్టీసీ కార్మికులు ఎస్. వెంకటయ్య, పర్వతాలు, రాములు, వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి బాల్ రెడ్డి.



వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్. నవంబర్ 15 నుండి 18 వరకు నలగొండ పట్టణంలో జరిగే అఖిల భారత జాతీయ రైతు సంఘం మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి బాల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల కోసం రసాయనక ఎరువులు పురుగు మందులు విత్తనాల ధరలను అధిక మొత్తంలో పెంచి రైతుల వెన్ను విరుస్తున్నదని గత దశాబ్ద కాలంగా రైతులకు గిట్టుబాటు ధర అందిస్తామని అధికారంలోకి వచ్చి రైతులను మోసగిస్తూన్నదని, గతంలో మూడు చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా దొడ్డి దారిన మళ్లీ చట్టాలను అమలుపరిచేందుకు ప్రయత్నిస్తున్నదని కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు రైతులు సన్నద్ధం కావాలని దేశవ్యాప్తంగా ఈ మహాసభలకు రైతు ప్రతినిధులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమ్ములు పరిచేందుకు ఈ మహాసభలు దోహదపడతాయని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా కరువు మండలాలను ప్రకటించి చోద్యం చూస్తున్నదని ఖరీఫ్ లో వేసి ఎండిపోయిన పంటలకు వాతావరణం సహకరించక రబీలో విత్తనం వేయని పంట పొలాలకు వాణిజ్య పంటలకు ఎకరాకు 50వేల రూపాయలు సాధారణ పంటలకు 30 వేల రూపాయల నష్టపరిహారం అందించాలని గత సంవత్సరం తీసుకున్న వ్యవసాయ రుణాలను రద్దుచేసి నూతనంగా వ్యవసాయ రుణాలను రైతులకు అందించాలని రైతు భరోసా పథకాన్ని తక్షణమే అమలు చేయాలని గత మూడు నెలల నుండి రాష్ట్రంలో వేలాది మంది రైతులు మరణించిన వారికి ఐదు లక్షల బీమా పథకాన్ని వర్తింపజేయాలని నీటి లభ్యత ప్రాంతాలను గుర్తించి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను ప్రవేశపెట్టి రైతులకు సాగునీరు అందించాలని, నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేస్తామని అనడం సరైంది కాదని గుంట భూమి ఉన్న ప్రతి రైతుకు ఇందిరమ్మ బీమా పథకాన్ని వర్తింపజేయాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డు లిస్టు కూలి బందు పథకాన్ని వారికి కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు పై డిమాండ్ల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు ఇంటికొక మనిషి ఊరికి ఒక బండి నల్లగొండ రండి నినాదంతో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.మహాసభల విజయవంతం కోరుతూ పోస్టర్ విడుదల చేసినవారిలో రైతు సంఘం జిల్లా కమిటీ నక్క ఈశ్వర్, సిఐటియు నాయకులు ఆశన్న, కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు వెంకటరెడ్డి, రైతు సంఘం నాయకులు బాలస్వామి, మత్స్యశాఖ నాయకులు వెంకట్ స్వామి, సాయిబాబా, ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్ గౌడ్, టప్ప నరసింహ, ఎర్ర వెంకటయ్య, కురువ ఉషన్, వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడే గైర్హాజరు.!

- ఆరుగురు ఉపాధ్యాయులకూ షోకాజ్ నోటీసులు

- నస్రుల్లాబాద్ జెడ్పీహెచ్ఎస్‌లో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

విధుల పట్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం

మహబూబ్‌నగర్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే విధులకు గైర్హాజరైతే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పడానికి నస్రుల్లాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఘటన నిదర్శనంగా నిలుస్తోంది. పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. మధుసూదన్ నాయక్‌కు విస్తుపోయే పరిస్థితి ఎదురైంది. ఏకంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు ఆరుగురు ఉపాధ్యాయులు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు.జడ్చర్ల మండలం నస్రుల్లాబాద్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు వివరాలను పరిశీలించగా ప్రధానోపాధ్యాయుడు సహా ఆరుగురు ఉపాధ్యాయులు విధులకు హాజరుకాలేదని వెల్లడైంది.దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్, గైర్హాజరైన ప్రధానోపాధ్యాయుడు, ఆరుగురు ఉపాధ్యాయులకు వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, సమయపాలన విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. పాఠశాలల పనితీరుపై విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.



విద్యార్థుల భవిష్యత్తుకు బాధ్యత ఎవరిది?

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందడం ఎంతో కీలకం. ఇలాంటి పరిస్థితుల్లో బోధనకు బాధ్యత వహించాల్సిన ఉపాధ్యాయులే విధులకు దూరంగా ఉంటే విద్యార్థుల చదువుపై ప్రభావం పడే అవకాశం ఉంది. కేవలం ఆకస్మిక తనిఖీలకే పరిమితం కాకుండా, ఇలాంటి గైర్హాజరు పునరావృతం కాకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

యువసేన ప్రధాన కార్యదర్శిగా గాలిముడి అరుణ్ కుమార్

- ఉమ్మడి పాలమూరు యువసేన జిల్లా అధ్యక్షుడు మారుతి

నాగర్ కర్నూల్ నవంబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో)

శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ ఆదేశాల మేరకు యువసేన పాలమూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎర్ర మారుతి.అచ్చంపేట లింగోటంకి చెందిన గాలిముడి అరుణ్ కుమార్ ను నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు తెలిపారు విద్యారంగ సమస్యల పైన నిరుద్యోగుల సమస్యల పైన పోరాటం చేయాలని ముఖ్యంగా నల్లమల్ల ప్రాంతంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ పిలుపును ముందుకుతీసుకుపోవాలని మారుతిసూచించారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గాలిముడి అరుణ్ కుమార్ మాట్లాడుతూ...నాపై నమ్మకం ఉంచి నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ బాధ్యతను అప్పగించినందున ధన్యవాదములు తెలియజేసారు.విద్యారంగ సమస్యల పరిష్కారం పైన రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ వ్యతిరేక విధానాలపైన పోరాదుతానని తెలిపారు. ముక్యంగా పార్టీ బలోపేతం పైన కృషి చేస్తానని రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమం ప్రారంభం చేస్తానని తెలిపారు.



శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో బహిరంగ వేలం

- ఈ నెల 14న వేలం ప్రక్రియకు సంబంధించిన ప్రకటన

ధరూర్ నవంబర్ 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం పెద్ద చింతరేవుల గ్రామంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వివిధ బహిరంగ వేలం ప్రక్రియలను నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు బహిరంగ వేలం ప్రక్రియకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు దినపత్రికల్లో ప్రకటన ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.దేవస్థానానికి సంబంధించిన వివిధ బహిరంగ వేలం ప్రక్రియల్లో ఆసక్తి ఉన్నవారు ప్రకటనలో పేర్కొన్న వివరాలను పరిశీలించి పాల్గొనాలని సూచించారు.

ఈ నెల 16న పిల్లల కోసం ప్రత్యేక ప్రజావాణి

- బాలల సమస్యలు,

హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమం



గద్వాల నవంబర్ 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):

బాలల వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 16న గద్వాల ఐడీఓసీ సమావేశ మందిరంలో సాధారణ ప్రజావాణితో పాటు పిల్లల కోసం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.బాలల హక్కుల పరిరక్షణ,వారి సమస్యల పరిష్కారం,సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాలలు తమకు ఎదురవుతున్న సమస్యలు,విద్య,ఆరోగ్యం, పోషకాహారం,వివక్ష,బాలల రక్షణ,బాల కార్మిక వ్యవస్థ,బాల్య వివాహాలు, పాఠశాలల్లో ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై తమ ఫిర్యాదులు, వినతులను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని తెలిపారు.బాలలు సమర్పించే ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు.కావున జోగుళాంబ గద్వాల జిల్లాలోని 18 సంవత్సరాల లోపు బాలలు స్వయంగా లేదా వారి తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సహకారంతో తమ ఫిర్యాదులు, వినతులను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది.?

హాస్టళ్లలో నీళ్లు, కరెంటు ఎందుకు బంద్.?

- విద్యార్థుల హాస్టళ్లకు నీళ్లు, కరెంటు బంద్ చేయడం దుర్మార్గం!

- నిరుద్యోగుల చదువుకు అడ్డంకులు సృష్టిస్తారా?

- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్ర విమర్శలు

- హాస్టళ్ల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి..

అరెస్టు చేసిన విద్యార్థులను విడుదల చేయాలి

మహబూబ్‌నగర్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):

తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేసేందుకు అప్పటి ప్రభుత్వం హాస్టళ్లలో నీరు, విద్యుత్ సరఫరా నిలిపివేసిన తరహాలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ విద్యార్థులను హాస్టళ్ల నుంచి బయటకు పంపించే ప్రయత్నాలు చేయడం అన్యాయమని మండిపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీకి సంబంధించిన ఈ-1, ఈ-2, డీ వసతి గృహాల్లో నీరు, విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హాస్టళ్లలోనే ఉండి చదువుకుంటామని అధికారులను కోరిన విద్యార్థులను అరెస్టు చేసి నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు తరలించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది.?

అశోక్‌నగర్‌కు వచ్చిన రాహుల్ గాంధీ ఆరు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని శ్రీనివాస్ గౌడ్ గుర్తుచేశారు. అవసరమైతే ముఖ్యమంత్రిని కూడా మారుస్తామని చెప్పిన నాయకత్వం ఇప్పుడు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి పరీక్షలు నిర్వహించామని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గతంలో



చేపట్టిన నియామకాలకు నియామక పత్రాలు అందించి తామే ఉద్యోగాలు కల్పించినట్లు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ల వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

హాస్టళ్లు కొనసాగించాలి.. ప్రత్యామ్నాయ వసతి కల్పించాలి

ఉద్యోగ నియామక ప్రకటనలు వెలువడే వరకు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో హాస్టళ్లను కొనసాగించాలని, స్టడీ సెంటర్లు నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు. హాస్టళ్ల మూసివేత నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకుని ప్రత్యామ్నాయ వసతి గృహాలు నిర్వహించాలని సూచించారు.తెలంగాణ ఉద్యమ సమయంలో హాస్టళ్లు మూసివేసినప్పుడు ఫంక్షన్ హాళ్లలో విద్యార్థులకు భోజన సదుపాయాలు కల్పించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పుడు కూడా విద్యార్థుల సమస్యలను తెలుసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆలోచిస్తామని తెలిపారు. గ్రామాల్లో తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను చూసి ఏదో ఒక ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో నిరుద్యోగ యువత కష్టపడి చదువుతోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు, వ్యవసాయ సమస్యల నేపథ్యంలో విద్యార్థులు ఇళ్లకు వెళ్లి చదువుకునే పరిస్థితులు కూడా అనుకూలంగా లేవని పేర్కొన్నారు.

అరెస్టులు, బెదిరింపులకు విద్యార్థులు భయపడరు.!

తెలంగాణ ఉద్యమ సమయంలో తిండికి ఇబ్బందులు ఎదురైనా ఉపవాసాలు చేస్తూ పోరాడిన విద్యార్థులు ఇప్పుడు ప్రభుత్వ చర్యలకు భయపడరని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అరెస్టులు, బెదిరింపులతో విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేయాలని చూడవద్దని హెచ్చరించారు. “తాటాకు చప్పుళ్లకు విద్యార్థులు భయపడరు.. అక్కడి నుంచే అగ్గిలా రాజుకుంటుంది.. జాగ్రత్త” అంటూ ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హాస్టళ్ల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, నిరుద్యోగుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, బీఆర్ఎస్వీ నాయకులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌ పై జిల్లా అధికారి ఆకస్మిక తనిఖీ

- అత్యవసర సేవల్లో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు..

ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందించాలి





చిన్నంబావి, నవంబర్ 13 (ప్రజాజ్యోతి)

అత్యవసర సమయాల్లో ప్రజలకు ప్రాణదాతగా నిలుస్తున్న 108 అంబులెన్స్ సేవలు మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కే. రవి శుక్రవారం చిన్నంబావి మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.అంబులెన్స్‌లోని మందులు, ఆక్సిజన్, అత్యవసర వైద్య పరికరాలు, వాటి పనితీరుతో పాటు నిర్వహణ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరికరాలను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కే. రవి మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు కాపాడటంలో 108 అంబులెన్స్ సేవలు అత్యంత కీలకమని, అత్యవసర సమయాల్లో క్షణం ఆలస్యం చేయకుండా స్పందించడం సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర ఘటనల్లో క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రులకు తరలిస్తూ విలువైన ప్రాణాలను కాపాడేందుకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంబులెన్స్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.మండల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించకుండా ప్రభుత్వ అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలు ఆసుపత్రికి వెళ్లేందుకు, ప్రసవ పరీక్షలు పూర్తయిన అనంతరం ఇంటికి చేరేందుకు అమ్మ ఒడి 102 సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 108 అంబులెన్స్‌లో షుగర్, బీపీ, పల్స్ వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకునే అవకాశం ఉందని వివరించారు.ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా 108, 102 అంబులెన్స్ సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, టెక్నీషియన్ నరేందర్, పైలెట్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఊరు రా ఇందిరమ్మట్ల జాతర

నర్వ నవంబర్ 13 ప్రజా జ్యోతి

నర్వ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు.. పేదల ఇంట సంతోషాల పండుగ. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నగారి ఆదేశాలతో.. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సహకారం మక్తల్ నియోజకవర్గం: నర్వ మండలంలోని ఉందేకోడ్ గ్రామంలో చాకలి సంధ్య లబ్ధిదారు నూతన ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికినర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ మరియు ఏఎంసి వైస్ చైర్మన్ డి కృష్ణ రెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి నూతన ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించడం జరిగింది. పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం.!ని మంత్రి వాకిటి శ్రీహరి అన్నగారి నాయకత్వంలో.. నర్వ మండలంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట.!ఈఈ కార్యక్రమంలో ణజజ జనరల్ సెక్రెటరీ నాగన్న గారి శ్రీనివాస్ రెడ్డి గారు, మండల ప్రధాన కార్యదర్శి నాగన్న గారి వివేకవర్ధన్ రెడ్డి గారు, మండల ప్రచార కార్యదర్శి బీసం రవికుమార్ గారు, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి అశోక్ గౌడ్ గారు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ లక్ష్మణ్ గౌడ్,నర్వ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్దల ఆంజనేయ రెడ్డి గారు, మండల్ నాయకులు చంద్రకాంత్ గారు, ఉందేకోడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండప్ప గారు, జ నాగప్ప గౌడ్, అవుసలి కాలప్ప గారు, కుమ్మరి ఆంజనేయులు, రామలింగం, వడ్ల నరేందర్, మంగలి రఘు, ఆకుల నరసింహ,గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు ఇబ్బందులు కలగకుండా కురుమూర్తి జాతర ఏర్పాట్లు!

- పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

- అధికారులకు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశాలు

మహబూబ్‌నగర్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):

దక్షిణ తెలంగాణలో భక్తిశ్రద్ధలకు ప్రతీకగా నిలిచే శ్రీ కురుమూర్తి స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు. జాతర ఏర్పాట్లలో నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.కురుమూర్తి స్వామి జాతర నేపథ్యంలో దేవస్థానం వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, వివిధ శాఖల సన్నద్ధతపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, వైద్య ఆరోగ్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, రవాణా సదుపాయాలు, పోలీసు భద్రత, భక్తుల రద్దీ నియంత్రణ తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లన్నీ ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను



యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జాతర సమయంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.



భక్తుల సౌకర్యాలే ప్రథమ ప్రాధాన్యత

కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీఓ వెంకటరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాత్రికేయులకు సన్మానం స్వీట్ బాక్స్ ల అందజేత

నర్వ నవంబర్ 13 ప్రజా జ్యోతి

బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు దండు అయ్యప్ప ఆధ్వర్యంలో శుక్రవారం తన నివాసం వద్ద నర్వ మండలం పాత్రికేయుల నూతన కార్యవర్గ సభ్యులందరికీ మర్యాదపూర్వకంగా ఆహ్వానించి టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో ఉపాధ్యాక్షులు లక్ష్మణ ల చేతుల మీదుగా శాలువాలు తో సన్మానించారు, స్వీట్ బాక్స్ లను అందజేశారు, ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కావలి కృష్ణ, రాంపూర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన ఉంటే నేరాలను అరికట్టవచ్చు

- డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరీ నిహారిక

నాగర్ కర్నూల్ : నవంబర్ 13 (ప్రజా జ్యోతి)

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవా అధికారసంస్థ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవదినోత్సవం నవంబర్ 09 పురస్కరించుకుని నిర్వహించే వారోత్సవాలలో బాగంగా శుక్రవారం నాగర్ కర్నూల్ మండల పరిధిలోని మంతటి గ్రామ పంచాయతీ కార్యాలయంలో చట్టాల పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నిహారిక హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని అన్నారు.చట్టాలపై అవగాహన కలిగి ఉండడం వల్ల సమాజంలో నేరాలు జరగకుండా అరికట్టవచ్చని,తద్వారా నేర రహిత సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు.అనంతరం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అందిస్తున్న ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు.ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునే స్తోమతలేని వారికి మాసంస్థ తరుపున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు.ఎవరికైనా ఉచిత న్యాయ సలహాలు కావాలంటే 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు.కార్యక్రమంలో చిలుకలక్ష్మయ్య, అడ్వకేట్,సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



రబీ సాగుపై సర్కారు ప్రత్యేక దృష్టి.!

- కూరగాయల సాగు 650 నుంచి 3,160 ఎకరాలకు పెంపు

- మరో 1,200 ఎకరాల్లో విస్తరణే లక్ష్యం..

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఖుష్బూ గుప్తా వెల్లడి

- జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు దిశానిర్దేశం





మహబూబ్‌నగర్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో): రాబోయే రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ప్రయోజనం చేకూరేలా పంటల సాగు కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని జిల్లాల వారీగా అనువైన పంటలను ఎంపిక చేసి సాగు వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని సూచించారు.శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి సీనియర్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, ఉద్యానవన శాఖ, సూక్ష్మ సేద్యం, బిందు సేద్యం, కూరగాయలు, పప్పుధాన్యాల సాగు, ధాన్యం కొనుగోళ్లు, భూసేకరణ సమస్యలు, పాఠశాల విద్యా కార్యక్రమాలపై సమీక్షించారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు.



పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత

రబీ సీజన్‌కు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసి రైతులకు సకాలంలో అందుబాటులో ఉంచాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. కూరగాయలు, పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను గరిష్టంగా వినియోగించుకోవాలని తెలిపారు. సూక్ష్మ సేద్యం, ముఖ్యంగా బిందు సేద్యం విస్తరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, భూసేకరణకు సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.

పాఠశాలలపై కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి

ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్లు తరచుగా సందర్శించి విద్యా కార్యక్రమాల అమలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, బోధనా ప్రమాణాలను పరిశీలించాలని సంజయ్ జాజు సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. వీబీ-జీ రామ్ జీ కార్యక్రమం విస్తరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

కూరగాయల సాగు విస్తీర్ణం పెంపులో మహబూబ్‌నగర్ ముందడుగు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ జిల్లాలో పంటల వైవిధ్యీకరణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి మండల కేంద్రంలో ఒక ఆదర్శ రైతును ఎంపిక చేసి, వారి ద్వారా ఇతర రైతులకు ఉద్యానవన పంటలు, ప్రకృతి వ్యవసాయం, బయో ఫార్మింగ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గతంలో 650 ఎకరాలుగా ఉన్న కూరగాయల సాగు విస్తీర్ణాన్ని ప్రస్తుతం 3,160 ఎకరాలకు పెంచినట్లు వెల్లడించారు. రబీ సీజన్‌లో అదనంగా మరో 1,200 ఎకరాల్లో కూరగాయల సాగు విస్తరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు ఉచిత విత్తనాల కోసం కోరుతున్నారని, వారి అవసరాలకు అనుగుణంగా విత్తనాలు అందించి సాగులో పూర్తిస్థాయి సహకారం అందిస్తే మరిన్ని మంచి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. కూరగాయలతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఇతర ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలు అందించడం ద్వారా రైతులను వరి సాగు నుంచి ఇతర పంటల వైపు ప్రోత్సహించవచ్చని తెలిపారు.

రైతులకు ప్రత్యామ్నాయ పంటలే దిక్కూచి.!

నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేపట్టడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు కల్పించవచ్చనే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. అయితే రైతులకు విత్తనాలు, సాంకేతిక సలహాలు, సాగు ప్రోత్సాహకాలు సకాలంలో అందినప్పుడే ఈ లక్ష్యాలు క్షేత్రస్థాయిలో సాకారమవుతాయి.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, డీఆర్డీఓ నర్సింహులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, జిల్లా పశువైద్య అధికారి శివానంద స్వామి, ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి జీవిత బీమా భరోసా!

– నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

– నవంబర్ 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

– అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు







మహబూబ్‌నగర్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసాతో పాటు జీవిత బీమా రక్షణ కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ పథకాన్ని నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పథకం విధివిధానాలు, అమలు, కుటుంబాల నమోదు ప్రక్రియ, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై సమీక్షించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కలెక్టర్ ఖుష్బూ గుప్తా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కులమతాలు, ఆదాయ పరిమితులతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా బీమా ద్వారా అండగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

నవంబర్ 14 నుంచి అవగాహన కార్యక్రమాలు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వేలో సేకరించిన కుటుంబాల వివరాలు, పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న రేషన్ కార్డుల సమాచారాన్ని ఆధారంగా చేసుకుని నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాలను కూడా సర్వే ఆధారంగా పరిశీలించి పథకంలో చేర్చాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు సమన్వయంతో గ్రామాలు, వార్డులు, డివిజన్లలో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. నమోదు కేంద్రాల తేదీలు, సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. నవంబర్ 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు, నమోదు విధానం, నామినీల ఎంపికపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు.

నామినీల ఎంపికలో కుటుంబాలకు స్వేచ్ఛ

బీమా మొత్తానికి ఒకరిని లేదా ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకునే అవకాశం కుటుంబాలకు కల్పించినట్లు భట్టి విక్రమార్క వివరించారు. ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకుంటే తమకు నచ్చిన విధంగా బీమా మొత్తాన్ని పంపిణీ చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల్లో నమోదు చేసిన వివరాలను కుటుంబ సభ్యులకు పూర్తిగా చదివి వినిపించి, వారికి అర్థమయ్యేలా వివరించిన తర్వాతే సంతకాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాము ఏ పథకానికి దరఖాస్తు చేస్తున్నారో, ఎవరిని నామినీలుగా ఎంపిక చేసుకున్నారో ప్రతి కుటుంబానికి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. నవంబర్ 17, 18 తేదీల్లో కూడా పథకం అమలు, నమోదు ప్రక్రియపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని, ప్రచార సామగ్రిని అందుబాటులో ఉంచాలని తెలిపారు.

నమోదులో పొరపాట్లకు తావివ్వొద్దు: సీఎస్ సంజయ్ జాజు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, బీమా ప్రయోజనం పొందే వారి వివరాలు, నామినీల సమాచారాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. నవంబర్ 19 నుంచి తదుపరి 15 నుంచి 20 రోజుల వ్యవధిలో నమోదు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పథకం అమలులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరసింహులు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) నర్సింహులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు-పిల్లలే దేశ భవిష్యత్తు - డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ సెక్రటరీ నిహారిక

నాగర్ కర్నూల్ : నవంబర్ 13 (ప్రజా జ్యోతి)

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవా అదికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్స్ డే కార్యక్రమం నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నిహారిక హాజరై మాట్లాడుతూ భారత దేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 14న,జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని బాలల దినోత్సవం జరుపుకుంటా రని నేటి బాలలే రేపటి పౌరులని,పిల్లలే దేశ భవిష్యత్తని పిల్లల ప్రాథమిక హక్కులు,విద్య,పోషకాహారం మరియు వారి రక్షణ గురించి సమాజంలో అవగాహన పెంచడం ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశ్యమన్నారు.అనంతరం పాఠశాల మరియు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన,మరి యు డ్రాయింగ్ పోటీలను నిర్వహించి ప్రతిభ కపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రభత్వ న్యాయవాది శ్రీరామ్ ఆ ర్య,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,విద్యార్థులు పాల్గొన్నారు.



బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం అండ!

- చిన్నారుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- కలెక్టరేట్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు.. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసిన కలెక్టర్









మహబూబ్‌నగర్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):

బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారి ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి చిన్నారికి జీవించే హక్కు, విద్యను పొందే హక్కు, ఆరోగ్యంగా ఉండే హక్కు, రక్షణ పొందే హక్కు ఉన్నాయని పేర్కొన్నారు. బాలల హక్కులకు ఎక్కడైనా భంగం కలిగితే పోలీసు, వైద్యారోగ్య, విద్య, న్యాయశాఖలతో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలు అండగా నిలుస్తాయని భరోసా ఇచ్చారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని పిల్లలకు సూచించారు. వివిధ కారణాలతో తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులను తిరిగి కుటుంబాలకు చేరువ చేసేందుకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాలల భద్రత, చట్టపరమైన హక్కులు, రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పిల్లలు తమ అభిరుచులు, ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా ఎదిగేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. చిన్నారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తూ వారికి తగిన అవకాశాలు కల్పించాలని తెలిపారు.

చిన్నారుల ప్రతిభకు కలెక్టర్ ప్రశంసలు

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వివిధ బాలల సంరక్షణ సంస్థల్లో చిత్రలేఖనం, పెయింటింగ్, సంప్రదాయ దుస్తుల ప్రదర్శన, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించినట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సీసీఐ విద్యార్థులు ఆలపించిన జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతం కలెక్టర్‌ను ఆకట్టుకున్నాయి. చిన్నారుల ఏకాగ్రత, ప్రతిభను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య కార్యక్రమం సైతం అందరినీ అలరించింది. అనంతరం కలెక్టర్ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఎస్. రవికుమార్, వివిధ బాలల సంరక్షణ సంస్థలకు చెందిన చిన్నారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

నాగర్ కర్నూల్ : నవంబర్ 13 (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఆదేశాలమేరకు ఎం.టి.ఓ రాఘవరావు మరియు ఏ.ఎం.టి.ఓ గౌస్ పాషా ఆధ్వర్యంలో శుక్రవారం తుడుకుర్తిలోని ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ లో







పోలీస్ వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి ఆరోగ్యం మరియు జాగ్రత్తలపై తగిన సూచనలు సలహాలు అందించారు. వాహనాలు సురక్షితంగా నడపడానికి కంటిచూపు ఎంతో ముఖ్యమని డ్రై వర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుచుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యభద్రతకు ప్రాధాన్యతనిస్తూ జిల్లా ఎస్పీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. తరచుగా జిల్లాలో ఉన్న పోలీస్ వాహనాల డ్రైవర్లు ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఎస్పీ గారు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

అచ్చంపేటలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

నాగర్ కర్నూల్ : నవంబర్ 13 (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రత్యేక వైల్డ్‌లైఫ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ,అటవీ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అడవుల ప్రాముఖ్యత,జీవ వైవిధ్యం, వన్యప్రాణుల ఆవాసాల పరిరక్షణ,మానవ--వన్యప్రాణుల మధ్య సంఘర్షణ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ప్రకృతిలో ప్రతిజీవికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని,వన్యప్రాణుల రక్షణ అందరి మనందరి బాధ్యతని,చిన్నతనం నుంచే ప్రకృతి పట్ల ప్రేమ,పర్యావరణ పరిరక్షణ భావన పెంపొందించాలన్నారు.అపోలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి వైద్య సలహాలు ఇచ్చి విద్యార్థులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు,డాక్టర్.రాజశేఖర్,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హనుమంతు నాయక్, అపోలో ఫౌండేషన్ వైద్య బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మండ్ల కురుమయ్య

- బీసీ యువత హక్కుల సాధనకు కృషి చేయాలి

- సంఘం ప్రతినిధులు

నాగర్ కర్నూల్ నవంబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో)

నాగర్ కర్నూల్ జిల్లా బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండ్ల కురుమయ్యను శుక్రవారం ఏకగ్రీవంగా నిర్వహించడం జరిగిందని బిసి ప్రతినిధులు స్పష్టం చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ్ కుమార్ నిర్ణయం మేరకు ఈ నియామకం చేపట్టారు.రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షులు అరవింద్ స్వామి, జిల్లా అధ్యక్షులు పిడికిలి శ్రీను ఆధ్వర్యంలో, బీసీ రాష్ట్ర కమిటీ సభ్యుల సమక్షంలో మండ్ల కురుమయ్యకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తూ నియామక ఉత్తర్వులు అందజేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీ యువతను ఐక్యం చేయడం, వారి హక్కుల సాధన కోసం కృషి చేయడం, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీసీ యువజన సంఘాన్ని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని ఆ సంఘం ప్రతినిధులు ఆదేశించారు. నూతనంగా నియమితులైన మండ్ల కురుమయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో నాగర్ కర్నూల్ జిల్లా బీసీ యువజన సంఘం అధ్యక్ష



బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ యువతను సంఘటితం చేస్తూ, బీసీల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. సంఘం అభివృద్ధికి నాయకులు, కార్యకర్తల సహకారంతో ముందుకు సాగుతానని వెల్లడించారు.మండ్ల కురుమయ్య నియామకం పట్ల బీసీ సంఘం నాయకులు, యువజన సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

యాదవుల సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీక సదర్ ఉత్సవాలు.!

- పూర్వీకుల సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

- టీడీ గుట్ట ఎక్స్‌రోడ్డులో ఘనంగా సదర్ సంబరాలు.. దున్నపోతుల విన్యాసాలతో సందడి

మహబూబ్‌నగర్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):

యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యత, ఆత్మగౌరవానికి సదర్ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మన పూర్వీకులు అందించిన గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీడీ గుట్ట ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ







భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం దున్నపోతుల విన్యాసాలు, ఆటపాటలతో ఉత్సవ ప్రాంగణం సందడిగా మారింది. యాదవ సోదరులకు సదర్ ఉత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి కులానికి ప్రత్యేకమైన నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలు ఉంటాయని, ఆధునిక యాంత్రిక జీవన విధానంలో వాటిని మరిచిపోకుండా కాపాడుకోవాలని సూచించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ తలుపులు తెరిచే పవిత్ర సంప్రదాయంలో యాదవ వంశీయులకు ప్రత్యేక స్థానం ఉందని గుర్తుచేశారు. ఇది యాదవుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రకృతిని, గ్రామదేవతలను పూజించడం, పశు సంపదను దైవంగా భావించడం మన పూర్వీకుల నుంచి వస్తున్న గొప్ప సంప్రదాయాలని అన్నారు. ఇలాంటి ఆచార వ్యవహారాలను కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు.సదర్ ఉత్సవాలు కేవలం వినోదానికి సంబంధించిన వేడుకలు మాత్రమే కాదని, యాదవుల ఐక్యత, సోదరభావం, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే గొప్ప సాంస్కృతిక పండుగ



అని వివరించారు. అన్ని వృత్తి కులాల వారు తమ తమ ఆచార సంప్రదాయాలను గౌరవించుకుంటూ పరస్పర సహకారంతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఐక్యతను చాటాలని, గొప్ప వారసత్వాన్ని భావితరాలకు అందించాలని శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు.